## కబడ్డీని ప్రోత్సహించాలి

వర్గల్,నవంబర్3: రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.జగదీశ్వర్‌యాదవ్,మహేందర్‌రెడ్డితో పాటు కార్యవర్గ సభ్యులు కుంటనొళ్ల శివకుమార్ ,సత్యంను జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని గౌరారంలో సన్మానించారు. అనంతరం కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కబడ్డీని ప్రోత్సహించాలన్నారు.కబడ్డీ అసోసియేషన్ జిల్లా సభ్యులు మహేశ్‌యాదవ్, నరేంద్రబాబు, స్వామి, బాలకృష్ణ, బాబు పాల్గొన్నారు.

## ధర్మ సమాజ్ పార్టీ జెండావిష్కరణ

వర్గల్,నవంబర్ 3: వర్గల్ మండలం నాచారంలో ఆదివారం స్థానిక బస్టాండ్‌వద్ద ధర్మ సమాజ్‌పార్టీ జెండాను ఆ పార్టీ రాష్ట్ర ఉమ్మడి జిల్లా నాయకుడు సుధాకర్‌యాదవ్ ఆవిష్కరించారు. నాయకులు బత్తుల చంద్రమోహన్, డప్పు లక్ష్మణ్, మాదిగ జాగృతి సంఘం నాయకులు కూచారం దయానంద్‌మహారాజ్, యాదగిరి, మంగని శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సీపీఎం మహాసభలను జయప్రదం చేయాలి

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 3 : కొండపాక మండలం దుద్దెడలోని ముదిరాజ్ భవనంలో ఈనెల 5వ తేదీన జరిగే సీపీఎం మండల మహాసభలను జయప్రదం చేయాలని ఆపార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బాలనర్సయ్య అన్నారు. ఆదివారం సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. ధాన్యాలకు రూ.500 బోనస్ ఇవ్వాలన్నారు. జగపతి, నాగరాజు, నర్ర ప్రతాప్‌రెడ్డి, కిష్టయ్య, కొమురయ్య, శ్రీనివాస్, కళావతి పాల్గొన్నారు.

## సమావేశాన్ని విజయవంతం చేయాలి

సిద్దిపేట టౌన్,నవంబర్ 3 : హైదరాబాద్‌లోఈ నెల 5న జరిగే ఎమ్మార్పీఎస్ రాష్ట్ర స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు.సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర సమావేశానికి జిల్లాలోని మదిగ,మాదిగ ఉపకులాలు, సంఘాలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో నాయకులు వెంకన్న,కృష్ణ,సాయిలు,లింగాల మహేశ్,దండు రాజు, కాకి యాదగిరి, కాసర్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

## అరుణాచల గిరిప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

సిద్దిపేట టౌన్,నవంబర్ 3 : కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని పవిత్ర అరుణాచల పుణ్యక్షేత్రంలో గిరి ప్రదక్షిణ చేయాలనుకునే సిద్దిపేట, దుబ్బాక పరిసర ప్రాంత ప్రజల సౌకర్యం కోసం సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతున్నట్లు సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అరుణాచల గిరి ప్రదక్షణ కోసం ఈ నెల 13న సాయంత్రం నాలుగు గంటలకు సిద్దిపేట నుంచి సూపర్ లగ్జరీ బస్సులు హైదరాబాద్‌కు,అక్కడి నుంచి 14న కాణిపాక విఘ్నేశ్వరస్వామి,వేలూరు మహాలక్ష్మి అమ్మవారు దర్శనం, అనంతరం 15న అరుణాచల గిరి ప్రదక్షణ పూర్తి చేసుకొని తిరిగి సిద్దిపేటకు వస్తారన్నారు.

## అడ్మిషన్ల గడువు పొడిగింపు

సిద్దిపేట టౌన్,నవంబర్ 3 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ ప్రథమ,ద్వితీయ, తృతీయ,పీజీ ప్రథమ,ద్వితీయ సంవత్సరం కోర్సుల్లో చేరేందుకు ఎలాంటి అపారాధ రుసుం లేకుండా అడ్మిషన్లు పొందుటకు గడువు ఈ నెల 15 వరకు పొడిగించామని కళాశాల రీజినల్ కో ఆర్డినేటర్ శ్రద్ధానందం తెలిపారు.ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## జూదరుల అరెస్ట్

వర్గల్,నవంబర్ 3: వర్గల్ మండలం మీనాజీపేట గ్రామ శివారులోని వ్యవసాయక్షేత్రం సమీపంలో నమ్మదగిన సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్, గౌరారం పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన దాడిలో 10 మంది జూదరులను అరెస్ట్ చేశారు. ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మీనాజీపేట సమీపంలో జూదం ఆడుతున్నారనే సమాచారం ఆధారంగా వెళ్లి దాడిచేయగా వారి వద్ద తొమ్మిది సెల్‌ఫోన్లు, రూ.31,919 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

# బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

## దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

రాయపోల్,నవంబర్ 3 : దౌల్తాబాద్ మండలం గాజులపల్లిలో రెండు రోజుల క్రితం మారుపాక అర్జున్ ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరగడంతో ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఆదివారం ఈ విషయం తెలుసుకొని గ్రామంలో పర్యటించి బాధిత కుటుంబ సభ్యులను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని, ఇల్లు దగ్ధమైన ఘటనలో జరిగిన నష్టం వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి బాధిత కుటుంబానికి తగిన సహాయం అందే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ చంద్రం, బీఆర్ఎస్ దౌల్తాబాద్ మండల యువజన అధ్యక్షుడు రాజేందర్,మండల నాయకులు స్వామి,అంజి ఉన్నారు.

**సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేపట్టాలి**

రైతులు పండించిన పత్తి పంటకు సరైన మద్దతు ధర లభించక ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదివారం ఆయన రాయపోల్ మండలం తిమ్మక్కపల్లిలో మాట్లాడారు. గ్రామాల్లో రైతులు పండించిన పత్తి పంట దళారుల పాలవుతుందని, దీంతో రైతులకు మద్దతు ధర దక్కడం లేదన్నారు. క్వింటాల్ పత్తికి రూ.6500 మాత్రమే చెల్లించి రైతుల దగ్గర దళారులు కొంటున్నారని ఆయ న అరోపించారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు లేక దళారులదే ఇష్టారాజ్యంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులకు క్వింటాల్‌కు రూ.7500 వరకు వస్తాయని ఆయన గుర్తు చేశారు.

దౌల్తాబాద్ మండలం గాజులపల్లిలో విద్యుత్ ప్రమాదంలో దగ్ధమైన ఇల్లును పరిశీలిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తదితరులు

## కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో భక్తుల సందడి

చేర్యాల, నవంబర్ 3 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి క్షేత్రం ఆదివారం భక్త జనంతో నిండిపోయింది. శనివారం సాయంత్రం కొమురవెల్లికి చేరుకున్న భక్తులు ప్రైవేట్, ఆలయ నిర్వహణలో ఉన్న దాతల గదులను అద్దెకు తీసుకుని రాత్రి బసచేశారు.ఆదివారం వేకువ జామునే నిద్రలేచి కోనేటిలో స్నానాలు ఆచరించారు.స్వామి వారిని దర్శించుకోవడంతో పాటు అభిషేకాలు,పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడిబియ్యం, కేశ ఖండన, గంగరేగు చెట్టు వద్ద ముడుపులు తదితర మొక్కులు తీర్చుకోవడంతో పాటు కొరికలు తీర్చాలని స్వామి వారిని వేడుకున్నారు. మహిళ భక్తిశ్రద్ధలతో బోనాలు తయారు చేసి కొండపైన ఉన్న ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించారు.మరి కొందరు రాతి గీరల వద్ద ప్రదక్షిణలు, కొడెల స్తంభం వద్ద కోడెలు కట్టి పూజలు చేశారు. గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టి తమ కోరికలు తీర్చాలని స్వామి వారిని వేడుకున్నారు. సుమారు 10వేల మంది మల్లన్న స్వామిని దర్శనం చేసుకున్నట్లు ఆలయవర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో ఏఈవో బుద్ది శ్రీనివాస్, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, ఆలయ పర్యవేక్షకులు పాల్గొన్నారు.

భక్తులతో గంగరేగు చెట్టు ఆవరణ పరిసర ప్రాంతం

మల్లన్న కల్యాణంలో పాల్గొన్న భక్తులు

## గ్రామీణ క్రీడాకారులు రాణించాలి

గజ్వేల్, నవంబర్ 3: అర్చరీలో గ్రామీణ క్రీడాకారులు రాణించాలని, ఇష్టమైన క్రీడను ఎంపిక చేసుకొని రోజూ సాధన చేస్తే తప్పకుండా రాణిస్తారని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి అన్నారు. ఆదివారం టీవైఆర్ ఫౌండేషన్ భవనంలో రాష్ట్ర అర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడిగా నియమితులైన టి.రాజు సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. కేవలం సంపన్న వర్గాలకే పరిమితమైన అర్చరీ క్రీడను గ్రామీణ ప్రాంతాల్లో పరిచయం చేసి ఇక్కడి క్రీడాకారులు నైపుణ్యం సాధించేలా శిక్షణ ఇవ్వాలన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులు అనుకున్న లక్ష్యానికి త్వరగా చేరుకుంటారని, వారిలో ఉండే పట్టుదల, సాధించాలనే కసితోనే అన్నింట్లో రాణించేలా ఉంటారన్నారు. గతంలో గజ్వేల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడల్లో చూస్తే గ్రామీణ ప్రాంత క్రీడాకారులే అధిక సంఖ్యలో పాల్గొని నైపుణ్యం సాధించారన్నారు. ప్రతి ఒక్కరూ చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం కల్పించాలని, చదువు ఒక్కటే విద్యార్థి మనుగడకు ప్రాముఖ్యత కాదన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు టి.రాజు మాట్లాడుతూ గజ్వేల్‌లో త్వరలోనే అర్చరీ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఆయా యువజన, ప్రజా సంఘాలు, ఉపాధ్యాయ సంఘాల, పట్టణ వాసులు టి.రాజును సన్మానించారు. మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎన్సీ.రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, చందు, మెట్టయ్య, భాగ్యలక్ష్మీదుర్గాప్రసాద్, ఐఎంఏ నాయకుడు డాక్టర్ లింగం పాల్గొన్నారు.

టి.రాజును సన్మానిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌రెడ్డి

## ధాన్యం కొనుగోలు కోసం రైతుల ఎదురు చూపు

బెజ్జంకి, నవంబర్ 3: కేంద్రాల్లో ధాన్యం పోసిన రైతులు కొనుగోళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. మండలంలో ఐకేపీ, వ్యవసాయ ప్రాథమిక సహకర కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. కొనుగోళ్లు ప్రారంభం కాక రైతులు ధాన్యం కుప్పల వద్ద పడిగాపులు కాస్తున్నారు.కొంతమంది రైతులు మిల్లులు, దళారులకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్నారు. రోజులు గడుస్తున్నా కొనుగోళ్లు లేక ఇబ్బంది పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముత్తన్నపేటలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో పోసిన ధాన్యం రాశులు

## ధాన్యాన్ని దళారులకు అమ్ముకుంటుండ్రు

కొమురవెల్లి, నవంబర్ 3 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు కాక రైతులు దళారులకు అమ్ముకుంటున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు తాడూరు రవీందర్ ఆరోపించారు. ఆదివారం మండలంలోని ఐనాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీపీఎం శ్రేణులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుమారు నెల రోజుల నుంచి రైతులు కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసి విక్రయం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించి వారం గడుస్తున్నా ఇంత వరకు మార్కెట్‌కు గన్నీ బ్యాగులు రాలేదని విమర్శించారు. అసలు కొనుగోలు కేంద్రం నడుస్తుందా లేదా అనే అనుమానం వ్యక్తం చేశారు. అన్ని రకాల ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వడంతో పాటు రైతుల ఖాతాల్లో 48 గంటల్లో డబ్బులు జమచేయాలన్నారు. మార్కెట్ కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు తేలు ఇస్తారి, సున్నం యాదగిరి, కానుగుల రాజు, పాశం చంద్రయ్య, దయ్యాల అనిల్, మల్లం యాదయ్య, శివయ్య, తేలు బాల మల్లు, రాములు పాల్గొన్నారు.

ఐనాపూర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

## నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కృషి

సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఈ సుధీర్‌బాబు

బెజ్జంకి, నవంబర్ 3: గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తున్నామని ఏడీఈ సుధీర్‌బాబు తెలిపారు. మండల కేంద్రంలోని సబ్‌డివిజన్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈలు మహేశ్, రామాంజనేయులు, సబ్‌ఇంజినీర్ పవన్, సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

## ఆరోగ్య పరిరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

హుస్నాబాద్, నవంబర్ 3: ఆరోగ్య పరిరక్షణ పట్ల ప్రజలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్ అన్నారు. ఆదివారం తెలంగాణ గ్రాడ్యుయేట్ ఫోర్స్, బిగ్‌టీవీ సంయుక్తంగా కెల్విన్ దవాఖాన సహకారంతో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. 250మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, తెలంగాణ గ్రాడ్యుయేట్ ఫోర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు బండారి రాజ్‌కుమార్, కౌన్సిలర్లు వాల సుప్రజ, బొజ్జ హరీశ్, దొడ్డి శ్రీనివాస్, చిత్తారి పద్మ, నాయకులు కవ్వ లక్ష్మారెడ్డి, కన్నోజు రామకృష్ణ, లింగారెడ్డి, వీరన్నయాదవ్, బత్తుల శంకర్‌బాబు, అనంతస్వామి, రాంప్రసాద్, విద్యాసాగర్ పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ రజిత

## అ పూర్వ సమ్మేళనం

అహ్మదీపూర్ పాఠశాల విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గజ్వేల్, నవంబర్ 3: మండలంలోని అహ్మదీపూర్ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల 1992-93 విద్యా సంవత్సరం టెన్త్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం గజ్వేల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ ఉపాధ్యాయులను సన్మానించి మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు.

**కుకునూరుపల్లిలో..**

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 3 : కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2012-13లో

కుకునూరుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టెన్త్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

టెన్త్ చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుని అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని సంతోషం వ్యక్తం చేశారు. తమకు చదువుచెప్పిన గురువులకు పాదాభివందనం చేసి వారిని ఘనంగా సన్మానించి జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, శ్రీనివాసచారి, చంద్రభాను, రవి, కనకలక్ష్మి, మల్లయ్య, సాజిద్, పూర్వ విద్యార్థులు బాబు, మధు, స్వామి, ప్రశాంత్, రాజు, శ్రీకాంత్, ఈశ్వర్, రమేశ్, కరుణాకర్, రాజు, ప్రమీల, శ్యామల, జ్యోతి మంగ, కృష్ణ పాల్గొన్నారు.

## మట్టి రోడ్డుకు మరమ్మతులు

పోతిరెడ్డిపల్లిలో గుంతల్లో మట్టి పోసి చదును చేయిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

చేర్యాల, నవంబర్ 3 : చేర్యాల మండలంలోని పోతిరెడ్డిపల్లిలో ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి రోడ్డు గుంతలమయంగా మారింది. ఆదివారం ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుంతల మయంగా మారిన రోడ్డుకు మరమతులు చేశారు. మట్టి రోడ్డుకు మరమ్మతులు చేసిన ఫౌండేషన్ సభ్యులను గ్రామస్తులు అభినందించారు. ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ అధ్యక్షుడు జింకాల పర్వతాలుయాదవ్, వ్యవస్థాపకులు పోరెడ్డి అనిల్, చంద్రం, అప్పల బాబు, మోహన్‌కుమార్, బాల్‌రెడ్డి , ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

**రోడ్డు సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యే**

మిరుదొడ్డి, నవంబర్ 3 : కొన్నేండ్లుగా దుబ్బాక మండలంలోని తిమ్మాపూర్, మిరుదొడ్డి మండలంలోని కొండాపూర్ గ్రామాల మధ్య ఉన్న బీటీ రోడ్డు గుంతలమయంగా మారి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.ఈ విషయాన్ని కొండాపూర్ గ్రామస్తులు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన సొంత ఖర్చులతో బీటీ రోడ్డు పైఉన్న గుంతలు పూడ్చివేయించి ప్రయాణికుల సమస్యను పరిష్కరించారు. ఎమ్మెల్యేకి కొండాపూర్ గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

మిరుదొడ్డి: కొండాపూర్ నుంచి తిమ్మాపూర్ వరకు ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి వేయించిన మట్టి రోడ్డు

## కులగణనలో అందరికీ ప్రాధాన్యం ఇవ్వాలి

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

గజ్వేల్, నవంబర్ 3: ప్రభుత్వం నిర్వహించే కుల గణనలో ఎస్‌జీటీలతో పాటు ఉపాధ్యాయులందరికీ ప్రాధాన్యం కల్పించాలని టీపీటీఎఫ్ గజ్వేల్ జోన్ కన్వీనర్ జల్లెళ్ల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం గజ్వేల్‌లోని కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల పని వేళల్లో కాకుండా ఉదయం సమయంలో సర్వే నిర్వహించాలని, ప్రాథమిక పాఠశాలల్లో సగం పూట బడి నడిపించాలంటే పాఠశాల వ్యవస్థను నిర్వీర్యం చేయడమే అవుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు మరింతగా బలహీనపడే అవకాశం ఉంటుందని, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ప్రైవేట్ విద్యారంగాన్ని ప్రోత్సహించేలా ఉందన్నారు. వెంటనే ప్రభుత్వం ఉపాధ్యాయులందరికీ విధులు కేటాయించి ఉదయం సర్వే ఉండేలా చూడాలన్నారు. గజ్వేల్ జోన్ సలహాదారులుగా రాజు, పాపిరెడ్డిని నియమించారు. రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రామచంద్రం, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ పాల్గొన్నారు.

## అవినీతి సమాజాన్ని నిర్మిద్దాం

ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న నెహ్రూ యువకేంద్రం వలంటీర్లు

చేర్యాల, నవంబర్ 3 : అవినీతి సమాజాన్ని నిర్మిద్దామని నెహ్రూ యువకేంద్రం ప్రతినిధి దొమ్మాట రాజు అన్నారు. ఆదివారం విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా అవినీతి వ్యతిరేక విధానానికి మద్దతు ఇవ్వాలని కొమురవెల్లి మల్లన్న ఆలయ ఆవరణలో మల్లన్న ఉద్యోగులతో కలిసి అవినీతికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు అవినీతి వ్యతిరేక విధానానికి మద్దతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఏవో బుద్ది శ్రీనివాస్, ఎక్స్ వలంటీర్ కటకం అమరేందర్, మల్లన్న ఆలయ ఉద్యోగులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలకు హరీశ్‌రావు పరామర్శ



ఖాతాలో యాదగిరి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

నంగునూరు, నవంబర్ 3 : మండలంలోని పలు కుటుంబాలను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదివారం పరామర్శించారు. మండలంలోని దర్గపల్లికి చెందిన సీనియర్ నాయకుడు మహేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు, సిద్దన్నపేట గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు కొంకటి లింగం తండ్రి అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు తిరుమలరెడ్డి నానమ్మ ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని, ఖాతా గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు యాదగిరి తల్లి మరణించడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. నాగరాజుపల్లికి చెందిన మాజీ సర్పంచ్ మల్లేశాన్ని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

సిద్దిపేట కమాన్ : మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులా రాజనర్సును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

**మున్సిపల్ చైర్‌పర్సన్‌కు పరామర్శ**

సిద్దిపేట కమాన్, నవంబర్ 3 : ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజులా రాజనర్సును మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పరామర్శించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

## సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం

గజ్వేల్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఈ భానుప్రకాశ్, ఏడీ జగదీశ్

గజ్వేల్, నవంబర్ 3: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని గజ్వేల్ విద్యుత్ శాఖ డీఈ భానుప్రకాశ్ అన్నారు. ఆదివారం గజ్వేల్ డివిజన్ కార్యాలయంతో పాటు గజ్వేల్, ములుగు, తుక్కాపూర్ సబ్ డివిజన్ కార్యాలయాల్లో విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయా సమస్యలపై వినియోదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ డివిజన్ పరిధిలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, వినియోగదారులకు ఏ సమస్య లేకుండా చూసుకోవడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో గజ్వేల్, ములుగు, తుక్కాపూర్ ఏడీలు జగదీశ్‌ఆర్య, జి.శ్రీనివాస్, ఎన్.శ్రీనివాస్, గజ్వేల్ ఏఈ మారుతి, డివిజన్ పరిధిలోని ఆయా మండలాల ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

**సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి**

హుస్నాబాద్, నవంబర్ 3: హుస్నాబాద్ విద్యుత్ డివిజన్ పరిధిలోని వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం అధికారులు, సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారని ట్రాన్స్‌కో డీఈఈఈ రావుల కృష్ణయ్య అన్నారు. ఆదివారం విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా హుస్నాబాద్‌లోని డీఈఈ కార్యాలయం ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణాలు, గ్రామాల్లో లూజులైన్లు, ఇతర సమస్యలు ఉన్నట్లైతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. గృహలక్ష్మి పథకం కింద దరఖాస్తు చేసుకొని జీరో బిల్లులు రానివారు వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. విద్యుత్‌కు సంబంధించి ఏ సమస్య ఉన్నా అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం పలువురు వినియోగదారులు వివిధ సమస్యలపై డీఈఈకి వినతిపత్రం అందజేశారు. ఏడీఈ ఉపేందర్, ఏఈ శశిధర్‌రెడ్డి, విద్యుత్ అధికారులు, సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

హుస్నాబాద్: సమావేశంలో మాట్లాడుతున్న డీఈఈ కృష్ణయ్య

## వినియోగదారులకు విద్యుత్‌పై అవగాహన

చేర్యాలలో వినియోగదారుల దినోత్సవం సందర్భంగా రైతును సన్మానిస్తున్న చేర్యాల ఏడీఈ వెంకటిగౌడ్ తదితరులు

చేర్యాల, నవంబర్ 3 : విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని చేర్యాల సబ్ డివిజనల్ ఇంజినీరు కార్యాలయంలో ఏడీఈ వెంకటిగౌడ్ ఆధ్వర్యంలో వినియోగదారులకు విద్యుత్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఈ వెంకటి గౌడ్ మాట్లాడుతూ రైతులకు తమ వ్యవసాయ బావిల వద్ద ప్లాస్టిక్ స్టార్టర్ బాక్స్‌లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ పై ఫ్యూజు వైరు పోతే విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇ